ప్రజాశక్తి
మంగళవారం 13 ఆగస్టు 2024
5
విజయనగరం



ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలి

హర్ ఘర్ తిరంగాలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశవ్యాప్తంగా ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ప్రతి పౌరుడు జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని వెల్లడించాలని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాను చేతబూని ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి ఉద్యమంలో పాల్గొనడం దేశ పౌరునిగా ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, మెప్మా పీడీ సుధాకర్ పలువురు జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పలు సమస్యలకు తక్షణ పరిష్కారం

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- గ్రీవెన్సుకు పోటెత్తిన వినతులు

రైతులకు చెల్లించాల్సిన రవాణా, కళాసీల ఛార్జీల గురించి మంత్రికి వివరిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాజకీయ యంత్రాంగం, ప్రభుత్వ అధికార యంత్రాంగం కలసి ప్రజా వినతుల కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఎన్నో వినతులకు తక్షణ పరిష్కారం చూపించగలిగామని మంత్రి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌తో పాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి కె.కార్తీక్‌లతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మంత్రి తమ జిల్లాలో నెలలో రెండు సార్లు ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొన్నట్టు చెప్పారు. ప్రజల సమస్యలకు జిల్లాస్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ఇది మంచి వేదిక అవుతుందన్నారు. భూసమస్యలపై అధికంగా వినతులు అందాయని మంత్రి చెప్పారు. ఆసుపత్రులకు సంబంధించిన సమస్యలు, ఇతర చిన్నచిన్న సమస్యలపై అక్కడికక్కడే పరిష్కారంపై అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఇక్కడ ఏ తరహా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, దానిని ముందుకు తీసుకువెళ్లేందుకు అవకాశాలు పరిశీలిస్తామన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులను ఉద్దేశించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వికసిత్ జిల్లాగా రూపొందించడంలో అధికారుల నుంచి పూర్తి సహాయ సహకారాలు అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రజా వినతులను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులందరి పనితీరుపై పర్యవేక్షణ వుంటుందని చెప్పారు.

వినతుల పరిష్కార వేదికకు 287 వినతులు

ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 287 వినతులు అందాయి. రెవిన్యూ సమస్యలపై 182, డిఆర్‌డిఎకు సంబంధించి 31, పంచాయతీరాజ్ శాఖకు 20, మున్సిపల్ శాఖకు 20, విద్యా శాఖ, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలకు 9 వంతున వివతులు అందాయి. పలు రెవిన్యూ సంబంధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధించి కలెక్టం అంబేద్కర్ ఆయా రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి ఆయా వినతులను పరిష్కరించిన అనంతరం రిపోర్టు చేయాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు, కార్పొరేషన్ లో పనిచేసే పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- ఒక వికలాంగుడు వినతితో మంత్రి స్పందిస్తూ వెంటనే వినికిడి పరికరాన్ని విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా వినికడి పరికరాన్ని వెంటనే అందజేశారు.
- సర్వే నంబర్ 36లో 23ఎకరాల 62 సెంట్లు గల నల్లచెరువు భూమి ఆక్రమణకు గురైందని, దాన్ని కాపాడాలని మంత్రిని అర్బన్‌బ్యాంకు మాజీచైర్మన్ కాళ్ల గౌరీశంకర్ కోరారు.
- జిల్లాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని జిల్లా కమిటీ చైర్మన్ బండ గోవింద కోరారు.
- విజయనగరం బిట్ టులో రజక వృత్తిదారుల స్వాధీనం అనుభవంలో ఉన్న భూమిపై హక్కును కల్పించాలని కోరుతూ పెద్ద రేవు రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం సభ్యులు వినతి అందజేశారు.
- పెద్ద చెరువు వద్ద మురుగు నీటి శుద్ధి కర్మాగారాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2018లో ప్రారంభించి సుమారు 80 శాతం పనులు చేశారని, తరువాత నిర్లక్ష్యం చేయడం వలన నేటికీ పనులు పూర్తికాక కట్టడాలు అసంపూర్తిగా ఈ పథకం నిర్వీర్యం అయ్యిందని టిడిపి నియోజకవర్గం నాయకులు తెలిపారు. విజ్జి స్టేడియంలో కేల్ ఇండియా బాక్సింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, బాక్సింగ్ రింగ్ మరియు క్రీడా పరికరాలు అందుబాటులోకి తేవాలని కోరారు. వినతినిచ్చిన వారిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రవాణా, కళాసీ ఛార్జీలు చెల్లించాలి

విజయనగరం టౌన్ : ఉమ్మడి విజయ నగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలులో సుమారు 90శాతం రవాణా, కళాసీ ఛార్జీలు రైతులే చెల్లించినా, ప్రభుత్వం విడుదల చేసిన ఆ ఛార్జీలు రైతులకు అందలేదని, వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, నాయకులు టి.పైడిపి నాయుడు కోరారు. జిల్లాలో సుమారు4లక్షల 2వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లా వ్యాప్తంగా రవాణా, హమాలి ఛార్జీలు క్వింటాకు రూ.52 రైతులే చెల్లించి నందున వారికి రావలసిన రూ.20కోట్లను చెల్లించాలని కోరారు.

కౌన్సిల్ తీర్మానాన్ని అమలు చేయాలి

కార్మికులను అప్కాస్‌లో చేర్చాలని కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి అందజేశారు. ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్‌లో పని చేస్తున్న 49 మందిని, ఇతర విభాగాలకు చెందిన మరో 5 మందిని ఆప్కాస్‌లో చేర్చేందుకు కౌన్సిల్ ఆమోదించిందని తెలిపారు. వినతినిచ్చిన వారిలో యూనియన్ అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.మురళి, నారాయణరావు పాల్గొన్నారు.

రెవెన్యూ మాయాజాలంపై సిబిఐతో విచారణ చేపట్టాలి

వేపాడ : మండలంలో అసైన్డ్ భూముల వ్యవహారంలో రెవెన్యూ మాయాజాలంపై సిబిఐతో విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి వినతి అందజేశారు. వేపాడ మండలం చామలాపల్లిలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా దళితులకు ఇచ్చిన భూములు, వీలుపర్తి, కెజిపూడి రెవెన్యూ పరిధిలో వందలాది ఎకరాల డి-పట్టా భూములు జిరాయితీగా మారిపోయాయని చెప్పారు. వీటిని విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వ్యక్తులు స్థానిక రియల్ ఎస్టేట్ దళారులు, కొంతమంది రెవెన్యూ అధికారుల సాయంతో తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. వీటిపై సిబిఐతో విచారణ చేపట్టాలన్నారు. అక్రమార్కులకు కొమ్ముకాసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

దత్తిరాజేరు ఎంఆర్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో

అసంబద్ధాలను సరిచేయాలి

ఎంఇఒ కార్యాలయాల వద్ద ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి-దత్తిరాజేరు, రామభద్రపురం

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల వనరుల కేంద్రాల (కౌన్సిలింగ్ సెంటర్లు) వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జీవో 117తో కాకుండా జీవో నంబరు 53 ప్రకారం సర్దుబాటు చేయాలని, అసంబద్ధాలను సవరించాలని కోరుతూ కౌన్సెలింగ్‌ను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించి ఎంఇఒలకు వినతులు అందజేశారు. విజయనగరం, దత్తిరాజేరు, తెర్లాం, భోగాపురం, రామభద్రపురం తదితర మండలాల్లో ఉపాధ్యాయులు కౌన్సిలింగ్‌ను బహిష్కరించిన నిరసన తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణన లోకి తీసుకోవాలని, ప్రాథమికోన్నత పాఠశాలలకు జిఒ 60 ప్రకారం స్కూల్ అసిస్టెంట్లను కేటాయించాలని, సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, స్టడీ లేవు, మెటర్నిటీ, దీర్ఘకాలిక సెలవుల ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుండి మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. రామభద్రపురంలో ఫ్యాప్టో నాయకులు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్, జోగారావు, జెసి రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. దత్తిరాజేరులో యుటిఎఫ్ నాయకులు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి.రాంప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి తాడేల రమేష్, సోమశేఖర్, పిఆర్‌టియు నాయకులు ఆర్ శంకరరావు, డిపిఆర్‌టియు నాయకులు యస్ నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో వినతి అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

బొబ్బిలి : పని సర్దుబాటుకు వ్యతిరేకంగా సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. స్థానిక శ్రీషిరిడి సాయి డిగ్రీ కళాశాలలో పని సర్దుబాటు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌ను ఉపాధ్యాయులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావుకు ఫ్యాప్టో నాయకులు టి.స్వామినాయుడు, నాయకులు వినతి అందజేశారు.

శృంగవరపుకోట : జిఒ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఆర్‌సి వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంఇఒలు నర్సింగరావు, లక్ష్మికి వినతులు అందించారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జి.వి.రమణ, ఎంఇఎఎస్ నారాయణ, ఎ.శ్రీనివాస్, విఎస్ దేవుడు, ఎ.రాము, జి.గణేష్ నాయుడు, జి.సూరిబాబు, టి.అప్పారావు, సిహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి (ఫైల్)

ముగడలో దారుణం

బంగారం కోసం వృద్ధురాలి హత్య

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ముగడ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు గద్దె కృష్ణవేణి(66)ను దొంగలు దారుణంగా చంపి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటనతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జయంతి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలిని చంపేసి ఆమె వద్ద బంగారు పుస్తెలతాడు, నాలుగు బంగారు గాజులు, మూడు చేతి ఉంగరాలు, ఒక జత చెవి దిద్దులు.. సుమారుగా 15 తులాలు బంగారాన్ని చోరీ చేశారని ఎస్ఐ తెలిపారు. 20 ఏళ్ల క్రితం దత్తిరాజేరు మండలం దత్తి నుంచి భర్త నారాయణప్పలనాయుడు ఉపాధ్యాయ వృత్తి నిమిత్తం బాడంగి మండలం వచ్చి ముగడ కాలనీలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరి కుమారులు పెళ్లిళ్లయి విశాఖ, పాలకొండలో ఉంటున్నారు. 2018లో భర్త చనిపోవడంతో ఆయనపై ఉన్న మమకారంతో ఆ ఇంట్లోనే కృష్ణవేణి ఒక్కరే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో ప్రవేశించిన దొంగలు ఆమెను చంపేసి, వంట గదిలో గ్యాస్ లీక్‌చేసి వెళ్లిపోయారు. గుడ్డతో గొంతు బిగించి చంపేసినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున పక్క ఇంట్లో ఉన్న తెంటు లక్ష్మి చూసి పాలకొండలో ఆమె కుమారుడు నాగేంద్ర కుమార్‌కు ఫోన్ చేసి గ్యాస్ లీక్ అవుతుంది, అమ్మకు ఫోన్ చేసి బయటకి వచ్చేయమని చెప్పు.. అంటూ సమాచారం ఇచ్చింది. ఆయన తన తల్లికి ఫోన్‌చేయగా, ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో ఎంపిటిసి దేవరాపల్లి శ్రీనుకు ఫోన్ చేసి వెళ్లాలని కోరారు. ఆయన వచ్చి చూసేసరికి అప్పటికే ఆమె మృతి చెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు. క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలించింది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు తమ్మినేని, తదితరులు

సహారా బాధితులకు న్యాయం చేయాలని

రేపు జిల్లా వ్యాప్త నిరసనలు

పోరాట కమిటీ సలహాదారు తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సహారా ఇండియా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, బాధితులపై ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 14న జరుగు జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని బాధితుల పోరాట కమిటీ సలహాదారు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి సహారా బాధితులకు డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, బాధితులే ముందుకు రావడం లేదని కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధమని అన్నారు. సహారా యాజమాన్యాన్ని అమిత్ షా, అతని తనయుడు వెనకేసుకొస్తున్నారని అన్నారు. బాధితులు ప్రీమియం టైం దాటి 12 సంవత్సరాలైనా నేటి వరకు దాచుకున్న డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. బాధితులంతా పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి ఉపయోగపడతాయని సహారా ఇండియాలో పొదుపు చేసుకున్నారని తెలిపారు. బాధితుల సమస్య పరిష్కారం విషయంలో రాష్ట్రం ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో నాయకులు ఎస్ఎ ఖాన్, టి.శ్రీనివాసరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

- 45 రోజులపాటు నిర్వహణ
- 16న స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా రాక
- గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలి
- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఈనెల 15 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సదస్సులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర సిబ్బందితో తన ఛాంబర్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈనెల 15న విజయనగరంలో మంత్రి చేతులమీదుగా రెవెన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభం అవుతాయని, మొత్తం 45 రోజులపాటు వీటిని నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 16 నుంచి జిల్లా అంతటా పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీరోజు ఏదో ఒక గ్రామంలోని రెవెన్యూ సదస్సుకు తాను హాజరవుతానని వెల్లడించారు. 5వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు సదస్సులు నిర్వహించాలని చెప్పారు. సదస్సుల్లో ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారని తెలిపారు. ముందుగానే ప్రతీ మండలంనుంచి షెడ్యూల్‌ను రూపొందించి ఎంఎల్ఎకు కూడా అందజేయాలని సూచించారు. సదస్సులకు రెవెన్యూ అధికారులతోపాటు, సర్వేయర్, దేవాదాయ, అటవీ వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖల ప్రతినిధులు కూడా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలకు వెళ్లేటప్పుడు ఆ గ్రామానికి సంబంధించిన ఎఫ్ఎంబి, ఆర్ఒఆర్, 1-బి, అడంగల్, ప్రభుత్వ భూముల వివరాలు తదితర అన్ని రకాల రికార్డులను తమతోపాటు తప్పనిసరిగా తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సదస్సుల్లో మ్యుటేషన్లు, ఎల్‌పిసి కార్డులు, భూ వివాదాలు, 22-ఒ, ల్యాండ్ గ్రాబింగ్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. ప్రతీ దానికీ ఒక రిజిష్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన ప్రతీ అర్జీకి ఒక రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. సదస్సు ముగిసిన తరువాత, సాయంత్రం 7గంటల లోపు పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను ఏరోజుకారోజు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో సదస్సులను పరిశీలించడానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఈ నెల 16న రానున్నారని, పలు మండలాల్లో పర్యటిస్తారని తెలిపారు.

ఎంపిడిఒలు పారిశుధ్యంపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సామగ్రిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా అక్టోబరు 2 నాటికి జిల్లాలోని అన్ని చెత్తనుండి సంపద సృష్టి కేంద్రాలూ శతశాతం పనిచేయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్న గజరాజులు

వివిఆర్‌పేటలోనే గజరాజుల తిష్ట

మొక్కజొన్న, చెరకు, వరి పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిఆర్ పేట పొలాల్లోకి ఈ నెల 11న ప్రవేశించిన గజరాజుల గుంపు అక్కడే తిష్ట వేసింది. సమీప ప్రాంతంలో సంచరిస్తూ మొక్కజొన్న, చెరకు వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామ రైతులు పట్టా శ్రీధర్, పూడి అప్పలనాయుడు, కోట్ల భగవాన్, కోట్ల ఉమా, వేగిరెడ్డి తవిటి నాయుడు, పట్టా చిన్న, రమేష్ సింహాచలం, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజరాజులు సంచరించేందుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండటంతో పాటు, ఈ గుంపులో ఒక ఏనుగు మరొక గున్న ఏనుగు పిల్లకు జన్మనివ్వడంతో గజరాజులు ఈ ప్రాంతంలో మరికొద్ది రోజులు ఉండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. దీని వల్ల పంటలు భారీగా నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజరాజులు సంచరిస్తున్న ప్రస్తుత ఈ ప్రాంతంలో చెరకు, మొక్కజొన్న తోటలు ఉండటంతో గజరాజులు సోమవారం కొంత సమయం పూర్తిగా కనిపించకపోవడంతో అటవీ శాఖ రేంజ్ అధికారి మణికంఠేశ్, బీట్ అధికారి స్వప్న డ్రోన్ కెమెరాతో గజరాజులు కదిలికలను పరిశీలించినట్లు విఆర్ఒ పట్టాభి తెలిపారు. గజరాజులను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో వంగర ఎస్ఐ వైవి జనార్ధన్ ఆ ప్రాంతానికి చేరుకుని పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలను డిప్యుటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, కారణాలు, నివారణా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 43 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని, జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో, స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జాతీయ రహదారుల జంక్షన్ల వద్ద లైటింగ్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, హెల్మెట్ వాడకంపై, పోలీసు, రవాణాశాఖలు సంయుక్తంగా అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. 43 బ్లాక్ స్పాట్స్ ను పోలీసు, రవాణా, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, అక్కడ ఏవిధమైన చర్యలను తీసుకోవాల్సి ఉంటుందో వారం రోజుల్లో తమకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. నివేదిక అందిన నాలుగు వారాల్లో అన్నిచోట్లా ప్రమాద నివారణా చర్యలను తీసుకుంటామని చెప్పారు. వైద్యారోగ్యశాఖ, జాతీయ రహదారుల అధికారులు చర్చించి, జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ను ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. అయినాడ జంక్షన్‌వద్ద రోడ్ల వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిటిసి మణికుమార్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ రత్నకుమార్, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు పాల్గొన్నారు. రహదారి భద్రత పై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.

బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి జిందాల్

బ్లాక్ స్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించేందుకుగాను ఎస్‌పి వకుల్ జిందాల్ బ్లాక్ స్పాట్లు, ముఖ్య కూడళ్ల వద్ద గల ట్రాఫిక్ పాయింట్లను సోమవారం పరిశీలించారు. నగరంలోని కామాక్షినగర్, అయ్యన్నపేట, పెద్దాసుపత్రి జంక్షన్, చర్చి జంక్షన్, ఆర్ అండ్ బి జంక్షన్, మాగ్గార్డెన్స్ జంక్షన్, ప్రదీప్ నగర్, ఆర్‌టిసి కాంప్లెక్స్, కోట, కొత్తపేట, అయ్యప్పస్వామి టెంపుల్ జంక్షన్, స్వామి లే అవుట్, రింగు రోడ్డులోని రైతు బజార్ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ జంక్షన్ లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుటకు గల కారణాలను ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా కాషనరీ బోర్డులు, స్కూల్స్, హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు, స్టాపర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా వెలుగు ఉండేలా లైటింగు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు నియంత్రించాలని, వాహనాల పార్కింగు లేకుండా చూడాలని, రేడియం స్టిక్కర్లును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇతర శాఖల సమన్వయంతో ప్రత్యేకంగా చర్యలు చేపడతామని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపుతామని ఎస్‌పి తెలిపారు. ఆయన వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఎస్‌బి సిఐ కెకెవి విజయనాథ్, వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు ట్రాఫిక్ సిఐ సూరినాయుడు , ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రీవెన్సులో 42 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ వినతులు స్వీకరించారు. 42 మంది తమ సమస్యలను వినతులు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్‌పి సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో చాలా వరకు భూవివాదాలకు సంబంధించినవి అధికంగా ఉన్నట్లు తెలిపారు.

ఎంపిడిఒకు వినతినిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు రాములు

ఉపాధి బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-మెంటాడ

ఉపాధి బిల్లులు చెల్లించాలని కోరుతూ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యాన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ఆంద్ర, కూనేరు, పోరాం, ఆగూరు, తమ్మిరాజుపేట గ్రామాల ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మే, జూన్ నెలల్లో ఉపాధి పనులు చేసిన కూలీలకు నేటికీ బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. 200 పనిదినాలు కల్పించాలని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని, జాబ్‌కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలరాం, జి.అప్పలస్వామి, పి.అప్పలస్వామి, డప్పు కళాకారుల సంఘం నాయకులు వి.దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పేలుళ్లతో ఇంటికి బీటలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని రామచంద్ర పేట గ్రామంలో సోమవారం జరిగిన బాంబు పేలుళ్లకు ఓ ఇంట్లో పెచ్చులు రాలాయి. ఆ గ్రామానికి సమీపంలో ఒక క్వారీలో సోమవారం మధ్యాహ్నం భారీ ఎత్తున పేలుళ్లు నిర్వహించారు. దీంతో రామచంద్ర పేట గ్రామానికి చెందిన ఇప్పిలి వెంకయ్య ఇంట్లోని ద్వారబంధం పైన ఉన్న పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా రాలిపోయాయి. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే బయటకు పరుగులు తీశారు. గతంలోనూ జరిగిన బాంబు పేలుళ్లకు ఇంట్లోని పైకప్పు పెచ్చులు రాలిపోయాయని వెంకయ్య తెలిపారు. మధ్యాహ్నం వేళ బాంబు పేలుళ్ల సమయంలో గ్రామస్తులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు.

సిఐ ప్రభాకర్‌రావు సేవలు ఆదర్శప్రాయం

బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొండపల్లి

గజపతినగరం సిఐగా వి.ఎన్ ప్రభాకర్‌రావు అందించిన సేవలు ఆదర్శప్రాయమని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి బోడసింగిపేట సమీపంలో ఓ ఫంక్షన్ హాల్లో గజపతినగరం ఎస్ఐ యు.మహేష్ అధ్యక్షతన బదిలీపై వెళ్తున్న గజపతినగరం సిఐ వి.ఎన్ ప్రభాకర్‌రావు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ శాఖాపరమైన విధులను అకింత భావంతో చేస్తూ మరోవైపు చెరగని చిరునవ్వుతో ప్రజల హృదయాల్లో చోటు సంపాదించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశంలో భోగాపురం సిఐ రామకృష్ణ, గజపతినగరం సిఐ జివివి రమణ, తదితరులు సిఐ ప్రభాకర్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె.లక్ష్మణరావు, లక్ష్మి, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నుంచి ఆ పేరు తొలగించాలి

ప్రజాశక్తి-వేపాడ

ఆర్‌డిఒ ఆదేశాలను ధిక్కరిస్తూ రెవెన్యూ సిబ్బంది తమ భూమిని మరొకరి పేరుతో రికార్డుల్లో నమోదు చేశారని, వెంటనే ఆ వ్యక్తి పేరు తొలగించాలని బొద్దాం గ్రామానికి చెందిన పి.కన్నయ్య, పి.రాములమ్మ, టి.సన్యాసమ్మ, పి.పార్వతి, పి.భవాని అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహశీల్దార్ డి.సన్యాసినాయుడుకు వినతి అందించారు. తమకు వారసత్వంగా సంక్రమించిన భూమిని రెవెన్యూ సిబ్బంది డబ్బులు తీసుకుని, పిల్ల రామసత్యం పేరుతో నమోదు చేశారని తెలిపారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేయడంతో ఆర్‌డిఒ విచారణ ఆదేశించి, నోటీసులు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఆర్‌డిఒ ఆదేశాలను బేఖాతరు చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ మహేష్ ఆయన చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఆయన గ్రంథాలయ శాస్త్రానికి చేసిన సేవలను కొనియాడారు. లైబ్రరీ శాస్త్రంలో ఆయన రచనలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహశీల్దారు పీరుబండి సుదర్శనరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులు 16 నుంచి 28 వరకు నిర్వహిస్తామని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వ వైన్స్ దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గడే రవి, లంక దుర్గారావు, పోరాపు వెంకటేష్, రాము కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు సోమవారం అందించారు. బేవరేజ్ సంస్థ ఉద్యోగులను కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

ఫైడెల్ కాస్ట్రోకు ఘన నివాళి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

క్యూబా విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రో 98వ జయంతిని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదంపై, నూతన వలసవాదంపై, దోపిడీపై ఫైడెల్ కాస్ట్రో అర్థ శతాబ్దం పాటు అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు, ఐక్యూఎసి డాక్టర్ బి.సుధీర్, అధ్యాపకులు డాక్టర్ జి.ఈరన్న, షేక్ వలిఖాన్, శ్రీలక్ష్మి, చల్ల శ్రీనివాసరావు, అప్పలరాజు, శివకుమార్, రామకృష్ణ, హైమావతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అక్రమంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఎపిఎం సురేష్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ప్రభుత్వానికి, గ్రామైక్య సంఘ సభ్యులకు వారధిగా పనిచేస్తున్న వారిని అక్రమంగా తొలగించడం అన్యాయమన్నారు. జీతం సకాలంలో అందకపోయినా, ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారినప్పుడు ఇలా స్కీమ్ వర్కర్లను తొలగించడం వల్ల గ్రామాల్లో గ్రూపుల పోరులు మొదలవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి సంస్కృతికి చరమ గీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గొల్ల సత్యనారాయణ, గంట్యాడ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

అసిస్టెంట్ కమిషనర్ పి.కృష్ణమోహన్

ప్రజాశక్తి-బొండపల్లి

పక్కా ప్రణాళికలు తయారు చేయడం ద్వారానే పంచాయతీలు అభివృద్ధికి నోచుకుంటాయని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ హరిహరరావు అధ్యక్షతన సర్పంచులు, గ్రామ కార్యదర్శుల మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో సర్పంచులు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ తదితర అంశాలు పై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, నరసింహం రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

దత్తిరాజేరు : వనరులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చేయాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ చంద్రకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావసరాల దృష్ట్యా గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా కొన్ని అంశాలపై దృష్టి పెట్టి పని చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్, ఇఒపిఆర్‌డి ఉషశ్రీ, ఎఒ శివాజీరావు, ట్రెయినీలు మహేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిశ్చల, ఇఒపిఆర్‌డి జి.ఉమ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : సర్పంచులు , కార్యదర్శులకు ప్రభుత్వం ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, ప్రభుత్వ నిధుల ఖర్చులపై, రాబడులపై సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భాస్కరరావు పాల్గొన్నారు.

డెంకాడ : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్, కార్యదర్శులదే కీలక పాత్ర అని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శిలకు మూడు రోజులు పాటు శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తే గ్రామాల అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు గ్రామంలో ప్రజలు, వార్డు మెంబర్లతో సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజ్, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచులు తప్పనిసరిగా ఈ చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీలో చేయాల్సిన విధులు, బాధ్యతలు, పరిపాలన, అధికారాలు వంటివి తెలుసుకోవాలన్నారు. ఇఒపిఆర్ డి.సురేష్ మాట్లాడుతూ . శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు హాజరవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్‌లు శంకర్, ప్రసాద్, ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచులు ఉప్పాడ శివారెడ్డి, కర్రోతు వెంకటరమణ, అపరభుక్త పైడినాయుడు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జెసి కార్తీక్ సేవలు ప్రశంసనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. నెల్లూరు జెసిగా బదిలీపై వెళ్తున్న కార్తీక్ ను సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జెసి చేసిన సేవలను అభినందించారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన, పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. జెసి కార్తీక్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, జిల్లాకు కలెక్టర్ గా రావాలని ఆకాంక్షించారు. ఏ స్థాయిలో ఉన్నా తనదైన ముద్ర వేసేందుకు కషి చేయాలని కలెక్టర్ సూచించారు. జెసి కార్తీక్ మాట్లాడుతూ, తాను ఇక్కడ పనిచేసింది కేవలం ఆరున్నర నెలలే అయినప్పటికీ, సొంత జిల్లాగా భావించానని అన్నారు. ఇక్కడి అధికారులు, ప్రజలతో బలమైన బంధం ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.డి. అనిత, డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ, జెడిఎ తారకరామారావు, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి సందీప్ కుమార్, ఆర్డీవో ఎం.వి.సూర్య కళ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తాడ్డి గోవింద, నాయకులు సూర్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, జెసి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, డిఆర్‌ఒ

జెసి సేవలను ప్రశంసించిన మంత్రి కొండపల్లి

జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కె.కార్తీక్ ప్రశంసనీయమైన సేవలు అందించారని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బదిలీపై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్తున్న నేపథ్యంలో మంత్రి సోమవారం కలెక్టరేట్‌లో జెసి కార్తీక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింతగా సేవలందించి ప్రజా జీవితంలో ఉత్తమ అధికారిగా పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గంలోని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వసతి గృహాల సలహా సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఇటు జిల్లా పరిషత్ నుంచి, సంబంధిత మంత్రి దృష్టి తీసుకువెళ్లి నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. భోగాపురం వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో చేరే ఏర్పాట్లు చూడాలని అమె అన్నారు. కోనాడ, ముక్కాం వసతి గృహాలలో విద్యార్థులు లేక ప్రస్తుతానికి మూసివేసామని ఎబిసిడబ్ల్యూఒ రాజులమ్మ తెలిపారు. డెంకాడలో జూనియర్ కళాశాల ఉన్నందున ఇంటర్ చదివే విద్యార్థులకు ఒక వసతి గృహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని డెంకాడ ఎంపిపి వాసుదేవరావు కోరారు. కొత్తగా వసతి గృహాల్లో చేరేందుకు వచ్చిన విద్యార్థులు దరఖాస్తులను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, నెల్లిమర్ల ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, అంబళ్ల సుధారాణి,

సిబ్బందిని వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే లోకం మాధవి

ఎఒ బంగారయ్య, వార్డెన్‌లు కృష్ణవేణి, శరన్మయి, అప్పలకొండ, జానకిరామ్ నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, మాత నవీన్, గుండపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలుకు, దురలవాట్లు,చెడు స్నేహాలకు దూరంగా ఉండాలనీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు.సోమవారం సత్యా విద్యా సంస్థలు డైరెక్టర్ మజ్జి శశిబూషణ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేసలి అప్పారావు మాట్లాడుతూ మెడికల్ షాప్‌లు, మద్యం షాపులలో తప్పని సరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల మాటలు పెడచెవిన పెట్టకుండా పాటించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, ఎన్‌సిసి లెఫ్టినెంట్ ఆఫీసర్ మీసాల సత్యవేణి సిబ్బంది సూరపు నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కేంద్రం ప్రారంభం

గరివిడి : మండలంలోని గెడ్డపువలస యూనిట్, కొండలక్ష్మీపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రకృతి వ్యవసాయ ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ప్రకాష్ రావు, ఎడిషనల్ డిపియం స్వామి నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులకు పంట తెగుళ్లు, దోమ, పురుగుల నివారణ కోసం ఇక్కడ కషాయాలు, ద్రావనాలు లభిస్తాయన్నారు. ఎటిఎమ్ మోడల్స్, ఏగ్రేడ్ మోడల్స్‌కు కూరగాయలు విత్తనాలు కూడా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎఒ శైలజ, విఎఎ ప్రియాంక, మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి, యూనిట్ ఇంచార్జి సింహాచలం, రాము పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ఎంఎం నాయుడు

కమిషనర్ వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చాయి. శానిటేషన్ కు సంబంధించి 1, హౌసింగ్ కు సంబంధించి 2, ఇతర సమస్యపై ఒకటి చొప్పున వినతులు అందాయి. వాటి పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. నగరంలో దోమల నియంత్రణకై ప్రతిరోజు ఫాగింగ్ యంత్రాలతో నివారణా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఎసిపి అమ్మాజీ రావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

హెచ్ఐవి,ఎయిడ్స్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం డిఎంహెచ్ఒ హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలసి జీవించాలి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డిఐఒ డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.సూర్యనారాయణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సీతం'లో జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆఫీసర్ ఇన్‌ఛార్జి లైబ్రరీ సి.నీలిమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాధన్ జయంతిని పురస్కరించుకొని ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. గ్రంథాలయాల స్థాపనకు ఆయన చేసిన కృషిని వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్ రావు మాట్లాడుతూ, కళాశాల లైబ్రరీలో ఎన్నో రకాల పుస్తకాలతో పాటు డిజిటల్ లైబ్రరీలో ఇ-జర్నల్స్, ఇ -బుక్స్ ఏర్పాటు చేసామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ్మూర్తి కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ లెంక సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బొత్స సత్యనారాయణ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అభినందనలు తెలిపారు.

విద్యాలయాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం, కెజిబివిని సోమవారం ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు సందర్శించారు. సిబిఎస్ఇ పరీక్షల కోసం ట్యాబులను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ంటే తమకు తెలియ జేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ శ్రద్ధగా చదువుకుని మంచి ప్రయోజకులుగా ఎదగాలని సూచించారు.

రాష్ట్రమంత్రి శ్రీనివాస్‌కు వినతినిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

మంత్రి శ్రీనివాస్‌కు యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని రాష్ట్ర చిన్న,మధ్య తరహా పరిశ్రమల, సెర్ఫ్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనసూయ మాట్లాడారు. 42 రోజులు సమ్మె చేసిన నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, వాటిని నెరవేర్చాలని కోరారు. గజపతినగరం నియోజకవర్గంలోని రంగుపురం, రామన్నపేట, కెంగువ తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, టిడిపి నాయకులు, కిందిస్థాయి నాయకులు అంగన్‌వాడీలను తొలగించి తమకు నచ్చిన వారిని నియమించుకుంటామంటూ వేధిస్తున్నారని తెలిపారు. కన్నాం గ్రామంలో సర్పంచ్ అంగన్‌శాడీ సెంటర్ తెరిచిన నుంచి ముగిసేవరకు ఫొటోలు తీసి తనకు పెట్టాలని ఆదేశిస్తున్నారని తెలిపారు. వి.కృష్ణాపురంలో టిడిపి,జనసేన నాయకులు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారని వివరించారు. గుచ్చిమిలో అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించి వేరే వారిని వేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. వెంటనే స్పందించి వేధింపులను అరికట్టాలని కోరారు. వినతినిచ్చిన వారిలో గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం సుభాషిని, పి జ్యోతి, సెక్టార్ లీడర్లు బి సౌజన్య, వాణి గణపతి పాల్గొన్నారు.

కల్వర్టు ఏర్పాటుచేయాలని వినతి

ప్రజాశక్తి-బాడంగి

ముగడ గ్రామంలో ఎస్‌సి కాలనీలో మురుగు నీరు వెళ్లేందుకు కల్వర్టు ఏర్పాటుచేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యాన దళితులు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆంజనేయులుకు వినతి అందించారు. కల్వర్టు లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండిపోతోందని, రోడ్డుపై నడవడానికి వీల్లేకుండా పోయిందని తెలిపారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. గతేడాది వడ్డే రవి అనే వ్యక్తి డెంగీ బారిన పడి మరణించాడని గుర్తుచేశారు. వెంటనే మురుగునీటి సమస్య పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో మర్రి నాని, బాల, సురేషు, చిన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం వరకు బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే బేబినాయన ఆదేశించారు. బైపాస్ రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బేబినాయన సోమవారం రోడ్డును పరిశీలించారు. గతంలో మున్సిపల్ నిధులతో పనులు చేసినప్పటికీ మరల రోడ్డు పాడైపోయిందని, నాణ్యమైన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తానన్నారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎఇ సురేష్, టిడిపి నాయకులు ఉన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యారంగ పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ పూర్వ నాయకులు కె.అప్పన్న, బి.సాయి కిరణ్ అన్నారు. పట్టణంలో సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

బొబ్బిలి : పట్టణంలోని జెండావీధిలో సోమవారం పేద విద్యార్థులకు బిల్లు కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఖాన్ పుస్తకాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఖాన్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

పశువుల పాకకు నిప్పు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో పశువుల పాకకు గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి నిప్పంటించి వెళ్ళిపోయాడు. భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు అర్పే ప్రయత్నం చేశారు. దీనిపై పాక యజమాని మీసాల గోవింద పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి క్యాన్ పట్టుకొని తిరుగుతున్నట్లు గుర్తించారు.

కబేళాలపై కేసులు నమోదు

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం టాస్క్ ఫోర్స్ సిబ్బంది, వన్ టౌన్ సిబ్బంది సంయుక్తంగా సోమవారం నిర్వహించిన పశువుల కబేళాలపై దాడులు చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలోగల స్టార్ బిర్యాని పక్కన ఉన్న ఒక స్లాటర్ హౌస్ పై దాడి చేసి 1100 కేజీల పసుమాంసాన్ని, 13 కోసిన ఆవులను, 37 జీవంలో ఉన్న ఆవులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ ఆఫీస్ దగ్గరలో గల పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కబేళపై దాడి చేసి 20ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ రెండు కేసుల్లో ఎనిమిది మందిని,మూడు వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ తారకేస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.